
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



కొనసాగుతున్న సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. పలు విభాగాలకు చెందిన దివ్యాంగులు పరీక్షలు చేయించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 517.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి నిత్యాన్నదానానికి కావూరుకు చెందిన తుమ్మల సాయి రాఘవ్ రూ. లక్ష విరాళాన్ని గురువారం సమర్పించారు.

ఆపరేషన్ ఏలనో..!

ప్రసవ 'వే'ధనం'.. సిజేరియన్ అసాధా'రణం'

- కాసుల కోసం కక్కుర్తి పడుతున్న వైద్యులు
- అవసరం లేకపోయినా శస్త్రచికిత్స చేసి కాన్పులు
- కన్నెర్ర చేస్తున్న అధికారులు
- 105 ఆస్పత్రులకు నోటీసులు

గుంటూరు మెడికల్: నవమోసాలు మోసి ఎన్నో ఆశలతో బిడ్డకు జన్మనిచ్చేందుకు ఆస్పత్రులకు వస్తున్న గర్భిణుల ప్రాణాలతో ప్రైవేటు వైద్యులు చెలగాటమాడుతున్నారు. కాసుల కోసం కక్కుర్తి పడి సిజేరియన్లు చేస్తున్నారు. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా.. ఆపరేషన్‌కే మొగ్గుచూపుతున్నారు. కొన్నిసార్లు ఆపరేషన్ వికటించి తల్లి, లేదా బిడ్డ ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.

ప్రభుత్వానికి ఫిర్యాదులు

సాధారణ కాన్పులకు అవకాశం ఉన్నా.. ప్రైవేటు వైద్యశాలలు సిజేరియన్లు చేసి రూ.లక్షలు దండుకుంటున్న వైనంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరం లేకపోయినా సిజేరియన్లు చేస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా గుంటూరు జిల్లాలో 105 ఆస్పత్రులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. 50 శాతానికి మించి ఆపరేషన్లు చేస్తున్న ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చినట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. జీజీహెచ్ గైనకాలజీ, ఎనస్థీషియా వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కూడిన కమిటీ ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీ చేసి ఆపరేషన్లు అధికంగా జరుగుతున్నట్టు గుర్తించిందని వెల్లడించారు. నిర్ణీత గడువులోగా సరైన సమాధానం ఇవ్వని ఆస్పత్రులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

కాన్పుకు రూ. 50 వేల నుంచి రూ.1.50 లక్షలు వసూలు

ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుకు రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు. సిజేరియన్‌కు రూ. 70వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. గత కొంతకాలంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న సిజేరియన్ల సంఖ్యను చూస్తే విషయం చెప్పకుండానే అర్థం అవుతుంది. 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు జిల్లాలో కాన్పులు 26,302 జరగ్గా, ప్రైవేటు ఆస్పత్రుల్లో 18,101 కాన్పులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 8,201 కాన్పులు జరిగాయి. సాధారణ కాన్పులతోపాటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ డెలివరీలు 4,101 జరగ్గా, ప్రైవేటు ఆస్పత్రుల్లో 14,422 జరిగాయి. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న వారిని సిజేరియన్ల పేరుతో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బంది పడేలా చేస్తున్నారు.



ఈ సందర్భాల్లోనే సిజేరియన్లు చేయాలి..

- గర్భంలో ఉన్న శిశువు 3.5 కేజీల బరువు దాటి కాన్పు అవ్వడం కష్టంగా ఉంటే..
- బాగా పొట్టిగా ఉన్న (4.5 అడుగులకంటే తక్కువ) మహిళలు గర్భం ధరించినప్పుడు వారి తుంటి విశాలంగా ఉండదు కాబట్టి కాన్పు అవడం కష్టమైతే..
- తల్లి గర్భంలో బిడ్డ ఆరోగ్యం సక్రమంగా లేకపోతే.. 'ఫీటల్ డిస్ట్రస్' ఉన్నట్లు నిర్ధారణైతే..
- నెలలు నిండకుండా (కనీసం 36 వారాలు), లేక ఎనిమిది నెలలు నిండకుండా నొప్పులు వస్తే..
- తొమ్మిది నెలలు నిండి పదో నెల మొదటి వారంలోకి వచ్చినా నొప్పులు రానప్పుడు..
- మాయ గర్భసంచిలో కిందిభాగంలో అతుక్కునప్పుడు రక్తస్రావం తీవ్రంగా అయ్యే అవకాశం కనిపించినప్పుడు..
- మాయకు బిడ్డకు మధ్య ఉండే 'అంబెలికల్ కార్డ్' యోని ద్వారా బయటకు వచ్చినప్పుడు..
- తల్లికి హైబీపీ, షుగర్, గుండెజబ్బు, రక్తహీనత ఉన్నప్పుడు..
- గర్భంలో కవలలు ఉన్నప్పుడు వారిని తీయడం అసాధ్యం అని భావిస్తే..
- గర్భసంచిలో కణితులు, అడ్డగోడలు ఉంటే..

సిజేరియన్లు తగ్గించడమే లక్ష్యం



అవసరం లేకున్నా.. సిజేరియన్లు చేసిన ఆస్పత్రులపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా 105 ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశాం. సిజేరియన్లు తగ్గించడమే లక్ష్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టాం. నోటీసులకు ఆస్పత్రుల యాజమాన్యాలు సరైన సమాధానం ఇవ్వకుంటే సీజ్ చేస్తాం. సాధ్యమైనంత మేరకు సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యులు చూడాలి. సిజేరియన్లు తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలి.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ, గుంటూరు

ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వండి

కలెక్టర్ నాగలక్ష్మి




మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి వేదికపై జేసీ

గుంటూరు వెస్ట్: జిల్లాలోని రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి అవసరమైన అనుమతులు, ఇతర ప్రక్రియలు నిర్దేశించిన సమయంలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలకు బోట్స్‌మెన్ సొసైటీకి కేటాయించే రాయిపూడి డి-సిల్టేషన్ పాయింట్ పర్యవేక్షణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో రాష్ట్ర మైనింగ్ శాఖాధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. బొమ్మువారిపాలెం-16 ఓపెన్ శాండ్ రీచ్ మైనింగ్ ప్లాన్‌ను రూపొందించి టెండర్ ప్రక్రియ సిద్ధం చేయాలన్నారు. గుండెమెడ ఓపెన్ శాండ్ రీచ్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బిడ్‌ను ఆహ్వానించి ఈ నెల 16నాటికి అర్హత గల బిడ్డర్‌కు కేటాయించాలన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద నదిలో ఇసుక నిల్వల కోసం హైడ్రో గ్రాఫిక్ సర్వే కోసం ఈఈ, కేసీ కెనాల్ డివిజన్‌కు జిల్లా వాటా కింద రూ.24 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరా చేసే కేంద్రాల వద్ద పర్యవేక్షణ కోసం సంబంధిత తహసీల్దార్ల ద్వారా రెవెన్యూ, మైనింగ్ ఉద్యోగులను నియమించుకోవాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నాగిని, తదితర అధికారులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సాగర్ కుడికాలువ గేట్లు

మూడేళ్లకే మరమ్మతులకు లోనైన 8వ గేటు



కుడికాలువ హెడ్ రెగ్యులేటర్

విజయపురిసౌత్: సుమారుగా 10.50లక్షల ఎకరాలకు సాగునీరందించే కుడి కాలువ గేట్లు మూడేళ్లకే మరమ్మతులకు లోనయ్యాయి. 8వ గేటు కిందికి దిగకపోవడంతో గురువారం ఎమర్జెన్సీ గేటు ద్వారా దానిని మూసివేసి 2వ గేటు ద్వారా కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు గేట్లు ఉండగా, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు 9 గేట్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం కుడి కాల్వ 9వ గేటు కిందికి, పైకి జరుగకపోవడంతో బలవంతగా కిందికి దింపేందుకు ప్రయత్నం చేయగా ఊడిపోయి కాలువలోకి కొట్టుకు పోయింది. ఆ గేటును అమర్చకపోవటంతో చాలా రోజులు వరకు నీటి విడుదల కొనసాగింది. ఆ సమయంలోనే కుడి, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దగల తూములకు కొత్తగేట్లకు టెండర్లు పిలిచారు. 9వ గేటు మరమ్మతులు చేశాక అదే కంపెనీకి పనులు అప్పగించారు. కుడి హెడ్‌రెగ్యులేటర్ గేట్లకు తొమ్మిదింటికిగాను రూ.3.30కోట్లు, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ మూడు గేట్లకు రూ.2.50కోట్లు, సూట్ గేటుకు రూ.1.50కోట్లకు 2022లో టెండర్లు పిలిచి పనులు చేయించారు. అవి కాస్త అప్పుడే మరమ్మతులకు గురైనట్లు సమాచారం. విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో హెడ్‌రెగ్యులేటర్ గేట్లు అంతగా వినియోగించ లేదు. నీటి అవసరాల మేరకు ఎక్కువగా 2,9వ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఇటీవలే ఈ రెండు గేట్లు మూసివేసి 8వగేటు ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం దానిని మూసేందుకు ప్రయత్నించగా కిందికి దిగలేదు. దీంతో ఇంజినీర్లంత శ్రమించి ఎట్టకేలకు మూసివేశారు. ప్రస్తుతం 2వ గేటు ద్వారా 3,031 క్యూసెక్కులు కుడి కాలువకు విడుదల చేస్తున్నారు. బుధవారం వరకు 4050 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియార్టీ జాబితా

ఈనెల 11 వరకు అభ్యంతరాల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు వెబ్‌సైట్లో ఉంచిన సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈనెల 11వ తేదీలోపు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన తరువాత వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

సొపాడులో వీధి కుక్కల దాడి

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం సొపాడు గ్రామంలో గురువారం వీధి కుక్కలు దాడిచేసి ఎనిమిది మందిని తీవ్రంగా గాయపరిచాయి. గాయపడిన ఎరుబోయిన గంగయ్య, ఇస్సాకు, తాటి మస్తాను, తాటి శివయ్య, నాగనజీమా, షేక్ బుల్లోడు, పరమేశ్వరరావు, గండు సాంబయ్యలను 108లో గుంటూరుకు జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో ఓ బాలుడు ఉన్నారు. ఇటీవల గ్రామాల్లో శునకాల బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత శనివారం వట్టిచెరుకూరులో రైతు మక్కెన సుబ్బారావుకు చెందిన బర్రెదూడపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇప్పటికీ దూడ పరిస్థితి విషమంగానే ఉంది. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయవ్యవస్థకు ప్రజలకు మధ్య పారా వలంటీర్లు వారధులు

13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ



నరసరావుపేటటౌన్: న్యాయవ్యవస్థకు, ప్రజలకు మధ్య వారధిలా ఉండి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ పేర్కొన్నారు. గురువారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్ల విధులు, నైతికత, రాతపూర్వక నైపుణ్యం, రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను, చట్టపరమైన సలహాలు ఇచ్చే విధివిధానాలను గురించి వివరించారు. న్యాయవ్యవస్థకు ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించి ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన కల్పించేలా కృషి చేయాలని సూచించారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 10వేల మెట్రిక్ టన్నులు

నరసరావుపేట: రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ 10వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా నిర్దేశించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం సేకరణ సమావేశం వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. రబీలో 2024-25 సంవత్సరానికి 234 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 20,561 హెక్టార్లలో వరిసాగు చేశారన్నారు. దీనిలో 1,32,773 ఎంటీల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయటం జరిగిందన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటా రూ.2320లు, సాధారణ రకం క్వింటా రూ.2300లుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందాలంటే ఈ-పంట ద్వారా పంటను నమోదుచేయించి 100శాతం ఈకేవైసీ చేయించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను త్వరగా కాలిబ్రేషన్ చేయించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నారదమునిని ఆదేశించారు. రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లు సామర్థ్యం, ఇతర వివరాలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి బస్తాతో కిరణ్‌బాబును పట్టుకున్న అరండల్‌పేట సీఐ వీరాస్వామి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బ్రాడీపేట 1/1వ లైన్‌లో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. ఏటి అగ్రహారానికి చెందిన పైర్ల కిరణ్‌బాబు బ్రాడీపేట 1/1 లైన్‌లోని నగరపాలక సంస్థ సులబ్ కాంప్లెక్స్‌లో పని చేసే బిహార్‌కు చెందిన గుల్షన్‌కుమార్‌కు గంజాయి విక్రయించి వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అరండల్‌పేట సీఐ వీరాస్వామి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. కిరణ్‌బాబు వద్ద బస్తాలో 20.620 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. గంజాయి కొనుగోలు చేసిన బిహార్‌కు చెందిన గుల్షన్ కుమార్‌నూ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కిరణ్‌బాబుపై సుమారు 39కి పైగా గంజాయి, దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కిరణ్‌బాబు డిసెంబర్‌లో బాపట్ల సబ్‌జైల్ నుంచి విడుదలై బయటకు వచ్చాడని విచారణలో తేలినట్లు చెబుతున్నారు. కిరణ్‌బాబు గంజాయిని ఎక్కడి నుంచి తీసుకు వస్తున్నాడు? నగరంలో ఎవరెవరికి విక్రయిస్తున్నాడు అనే వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

కన్నకొడుకే కాలయముడు

- మతి స్థిమితం లేని తల్లిని చంపిన కొడుకు
- మంచంపై నిద్రిస్తుండగా రోకలి బండతో మోది హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రభాకర్



మృతిచెందిన గజ్జ సోమమ్మ

బొల్లాపల్లి: కన్న కొడుకు చేతిలో జన్మనిచ్చిన తల్లి దారుణంగా హత్యకు గురైన సంఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో గురువారం జరిగింది. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... వెల్లటూరు గ్రామానికి చెందిన గజ్జ చిన్న నరసయ్య, గజ్జ సోమమ్మ (67) దంపతులకు ముగ్గురు మగ, ఇద్దరు ఆడ సంతానం. చిన్న కుమారుడు బాదరయ్య అవివాహితుడు కావడంతో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. మిగిలిన సంతానంలో అందరికీ వివాహాలై వేర్వేరుగా ఉంటున్నారు. మతిస్థిమితం లేని తల్లి ఎప్పుడు గొణుగుతుండడం, తనకు వివాహం కాకపోవడంపై అసంతృప్తిగా ఉన్న నిందితుడు బాదరయ్య తెల్లవారుజామున మంచం మీద పడుకుని నిద్రిస్తున్న తల్లిని రోకలిబండతో కొట్టడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు గజ్జ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అందజేశారు.

యార్డుకు 1,25,074 మిర్చి బస్తాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,25,074 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,23,828 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,600 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 57,307 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.



టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

- విధులకు 945 మంది ఉపాధ్యాయులు
- మినహాయింపు కోరుతూ డీఈఓ వద్దకు క్యూ కట్టిన టీచర్లు
- షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించడంతో విధుల్లో చేరిక



స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో విధులకు హాజరైన ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. గుంటూరు నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో క్యాంపు అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అధ్యక్షతన జరిగిన మూల్యాంకనం విధులకు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈనెల 9 వరకు జరగనున్న వాల్యుయేషన్ విధులకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను నియమించారు. వీరిలో కొందరు గురువారం వాల్యుయేషన్ కేంద్రంలో రిపోర్టు చేసేందుకు వచ్చారు.

డీఈఓ సీరియస్

అయితే చాలామంది విధుల నుంచి మినహాయింపు కోరడంపై డీఈఓ సీవీ రేణుక అసహనం వ్యక్తం చేశారు. స్పాట్ వాల్యుయేషన్ ఆర్డర్లు పొందిన ఉపాధ్యాయులు విధుల్లో చేరని పక్షంలో వారిని తన అనుమతి లేకుండా పాఠశాలల్లో విధులకు చేర్చుకోరాదని హెచ్ఎంలను ఆదేశించారు. సహేతుకమైన కారణాలు లేకుండా విధుల నుంచి తప్పించుకోవాలని చూసే ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. డీఈఓ హెచ్చరికలతో దిగి వచ్చిన ఉపాధ్యాయులు ఎట్టకేలకు స్పాట్ కేంద్రంలో రిపోర్టు చేశారు. చీఫ్ ఎగ్జామినర్లు 105, ఎగ్జామినర్లు 630, స్పెషల్ అసిస్టెంట్లు 210 మంది చొప్పున విధులకు హాజరయ్యారు. దూరవిద్య ఇంటర్ ఆన్సర్ షీట్లకు ఇదే ప్రాంగణంలో మూల్యాంకనాన్ని ప్రారంభించారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి వసతులు కల్పించినట్లు డీఈఓ సీవీ రేణుక చెప్పారు.

విధుల నుంచి మినహాయించండి



మినహాయింపు కోరుతూ డీఈఓ వద్ద గుమిగూడిన ఉపాధ్యాయులు

చాలామంది తమను విధుల నుంచి మినహాయించాలని కోరుతూ డీఈఓ సీవీ రేణుక వద్ద క్యూ కట్టారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు, అత్యవసర శస్త్రచికిత్సలు చేయించుకున్న ఉపాధ్యాయులను విధుల నుంచి మినహాయించేందుకు అధికారులకు అవకాశం ఉంది. దీంతో ఉపాధ్యాయులు ఏదో ఒక సాకుతో విధుల నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతల సిఫార్సులతో యత్నిస్తున్నారు. దాదాపు 50 మంది వరకు ఉపాధ్యాయులు వేర్వేరు కారణాలతో మినహాయింపులు కోరడంతో గురువారం మధ్యాహ్నానికీ మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఆ తర్వాత డీఈఓ హెచ్చరికతో గురువులు దిగొచ్చారు. మూల్యాంకనం ప్రారంభమైంది.

దమ్ముంటే పెమ్మసాని రాజీనామా చేయాలి

ఇచ్చిన మాటకు కట్టుబడాలి

- వక్ఫ్‌బోర్డు బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు తెలపడం సిగ్గుచేటు
- వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ధ్వజం



ఎన్నికల సమయంలో పెమ్మసాని చేసిన ఉపన్యాసం వీడియోను చూపుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): మైనార్టీల స్వేచ్ఛకు భంగం కలిగితే తక్షణం రాజీనామా చేస్తానని ఎన్నికల వేళ హామీ ఇచ్చిన ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ దమ్ముంటే ఇప్పుడు తక్షణం మాట నిలబెట్టుకోవాలని వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆమె గురువారం గుంటూరు మంగళదాస్ నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు బిల్లు ముస్లింల హక్కులను హరిస్తుందని ధ్వజమెత్తారు. మోసం చేయడంలో గురువు చంద్రబాబును పెమ్మసాని అనుసరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో పెమ్మసాని చేసిన ఉపన్యాసం వీడియోను ప్రదర్శించారు. వక్ఫ్‌బోర్డు బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీ, జనసేన మైనార్టీలకు ద్రోహం చేశాయని దుయ్యబట్టారు. వక్ఫ్‌బోర్డులో నాన్ మైనార్టీ సభ్యుడిని పెట్టే అంశం వల్ల ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందారు. వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్ఆర్సీ బిల్లును వ్యతిరేకించడంతోపాటు, పార్లమెంట్‌లో కూడా సుస్పష్టంగా ఎంపీల చేత చెప్పించిన అంశాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు ముస్లింలకు ఎప్పుడూ అన్యాయం చేస్తూనే ఉన్నారని విమర్శించారు.

ఈవీఎం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నోరు మెదపరేంటీ..!

మైనార్టీలకు తీరని ద్రోహం జరుగుతుంటే, మైనార్టీ ఎమ్మెల్యే అయిన ఎం.డీ.నసీర్ అహ్మద్ నోరు మెదపకపోవడం హాస్యాస్పదంగా ఉందని ఫాతిమా అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా గెలిచారు కనుకనే ఆయనకు మైనార్టీల కష్టాలు ఏమాత్రం తెలియవన్నారు. ఈద్గా వద్ద దీనిపై చర్చించేందుకు పలువురు సుముఖత చూపిన నేపథ్యంలో పక్కన పేటీఎం బ్యాచ్‌ను పెట్టుకుని ఏ ఒక్కరినీ రానీయకుండా నసీర్ అడ్డుకున్నారని విమర్శించారు. మైనార్టీలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కులమతాలకతీతంగా అందరూ మైనార్టీలకు అండగా నిలవాలని ఫాతిమా కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నేతలు, పలువురు డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **7,000** గరిష్ఠం : రూ. **9,400**

మోడల్ ధర రూ. **8,000**

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో గురువారం 1257 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 1021 బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.11,000, గరిష్ఠ ధర రూ.12,561, మోడల్ ధర రూ.12,175 పలికిందని వివరించారు. కాయలు 236 బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.11,000, గరిష్ఠ ధర రూ.12,561, మోడల్ ధర రూ.12,175 పలికిందని వెల్లడించారు. మొత్తం 942.750 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు శ్రీనివాసరావు వివరించారు.

పంపిణీ చేసే ఇళ్ల స్థలాల పరిశీలన



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలు వద్ద శుక్రవారం పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను శుక్రవారం ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్థల పట్టాల పంపిణీని ప్రారంభించనున్న నేపథ్యంలో ఎస్పీలీ పరిశీలన జరిపారు. అధికారులకు భద్రతా సూచనలు చేశారు. ట్రాఫిక్, , వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ వై. శ్రీనివాసరావు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



వేమూరు: మండలంలోని చంపాడు ఇరిగేషన్ కాలువ వంతెన వద్ద ఇసుక ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. వివరాలు మేరకు... కొల్లూరు మండలంలోని గాజులంక నుంచి తెనాలికి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పోలీసు స్టేషన్‌లో ముడుపులు చెల్లించడంతో రాత్రి వేళ తిరిగే లారీలు, ట్రాక్టర్ల యజమానులపై పోలీసులు కేసు నమోదు లేదు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గాజులంక గ్రామం నుంచి ఇసుక లోడుతో ట్రాక్టర్, లారీ బయలుదేరాయి. చుంపాడు ఇరిగేషన్ కాలువ వంతెన వద్ద ట్రాక్టర్‌ను లారీ ఢీకొని పడిపోయింది. వంతెన వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అక్రమ ఇసుక విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఘటనాస్థలం వద్దకు చేరుకున్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు వచ్చి మిషన్ల ద్వారా ఇసుక లారీని తొలగించారు. సీఐ మాట్లాడుతూ స్టేషన్‌లో ఫిర్యాదు అందలేదన్నారు.

ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా

పైపులైన్ పనులు ఆగవు

- పోలీసుల భద్రతతోనైనాపూర్తిచేస్తాం
- బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటుపై రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులు



బీపీసీఎల్ పైపులైన్ భూ వినియోగం గురించి రైతులకు వివరిస్తున్న స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఎం.శ్రీదేవి

నకరికల్లు: ఒప్పుకున్నా లేకున్నా పోలీస్ ప్రొటెక్షన్ తీసుకొని పైపులైన్ చేపడతామని అధికారులు రైతులను హెచ్చరించారు. బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటులో భాగంగా మండలంలోని చల్లగుండ్ల, నకరికల్లు, నర్సింగపాడు గ్రామాల రైతులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటుకు భూములు తీసుకునేది భూసేకరణ కిందకు రాదని భూ వినియోగం మాత్రమేనన్నారు. గుర్తించిన భూమిలో ఆరుమీటర్ల లోతులో ఒకటిన్నర మీటరు వెడల్పులో పైపులైను ఏర్పాటు ఉంటుందన్నారు. పైపులైను పనులు చేపట్టేందుకు 18 ఇంటు 18మీటర్ల వెడల్పులో భూమిని వినియోగించుకొని పైపులైన్ పూర్తయ్యాక భూమిని యథావిధిగా బాగు చేసి ఇస్తామన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట పూర్తయ్యాకే పనులు చేపతామన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న భూముల విలువను బట్టి రెండున్నర రెట్లు కలిపి మొత్తం సెంటుకు రూ12వేలు చొప్పున రైతులకు చెల్లిస్తామని తెలిపారు. దీనికిగాను రైతులు అంగీకారపత్రం ఇవ్వాలని ఒకవేళ ఒప్పుకోకుంటే ఇది కేంద్రప్రభుత్వం ప్రాజెక్టు అని పోలీస్ బందోబస్తు నడుమ అయినా పూర్తిచేసి తీరాల్సి వస్తుందని హెచ్చరించారు.

డిమాండ్లకు ఒప్పుకొంటేనే భూములిస్తాం..

పైపులైను వేసిన భూముల్లో గోడౌన్‌లు కట్టుకోవాలన్నా... ప్లాట్లు వేసుకోవాలన్నా... అమ్ముకోవాలన్నా, భూమిలో పైపులైన్లు ఉండడం మూలంగా ఇబ్బందులు తలెత్తుతాయని, పనులు చేపట్టే క్రమంలో భూమిని పంటకు పనికిరాకుండా చేస్తారని, హద్దురాళ్లు చెల్లాచెదరు చేస్తారని రైతులు వాపోయారు. హామీలు నెరవేరుస్తామని రాతపూర్వకంగా ఇవ్వాలని, అలాగే సెంటుకు రూ.20వేలు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే భూములు ఇచ్చేందుకు ఒప్పుకోమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పనులు చేపట్టిన 105 గ్రామాల్లో సెంటుకు రూ 2వేలు చొప్పున మాత్రమే ఇచ్చారని, ఇక్కడి రైతుల కోసం రూ 12వేలు ఇస్తున్నార న్నారు. తహశీల్దార్ కె.పుల్లారావు, బీపీసీఎల్ ప్రాజెక్టు లీడర్ భగవాన్ శుక్లా, సైట్ ఆఫీసర్ అమిత్ కాంబ్లో, సైట్ ఇన్‌చార్జి పవన్, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.



అధికారుల ఎదుట అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న మూడుగ్రామాల రైతులు

నవ్యకేర్‌తో జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ ఒప్పందం

గుంటూరు మెడికల్ : క్యాన్సర్ రోగులకు మెరుగైన, సత్వర వైద్య సేవలు అందించేందుకు గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ గురువారం నవ్య కేర్ నెట్‌వర్క్, నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఆంధ్రప్రదేశ్ చాప్టర్)తో ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో క్లినికల్ సామర్థ్యాలను మెరుగుపరచడం, ఆధారిత చికిత్సా ప్రణాళికలు, వర్చువల్ మల్టీడిసిప్లినరీ ట్యూమర్ బోర్డ్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు వర్చువల్‌గా ప్రాజెక్టును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టాటా మెమోరియల్ సెంటర్, హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, విశాఖపట్నం మధ్య ఏర్పడిన భాగస్వామ్యంలో ఒక భాగమని పేర్కొన్నారు. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ రాష్ట్రంలో క్యాన్సర్ సంరక్షణను మెరుగుపరచడానికి ఒక సమర్థవంతమైన నెట్‌వర్క్‌ను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు కింద కింగ్ జార్జ్ హాస్పిటల్ (విశాఖపట్నం), గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (కాకినాడ), గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (గంటూరు), స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (కర్నూల్)లలో అమలు చేస్తారన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఎక్కడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ ఈ ప్రోగ్రాం గురించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ సంరక్షణను మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ గుంటూరు, చుట్టుపక్కల జిల్లాల ప్రజలను మెరుగైన క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు తాము అన్ని విధాలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో నాట్కో క్యాన్సర్ సెంటర్ కో ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, క్యాన్సర్ వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్, డెప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, క్యాన్సర్ వైద్యులు

ఉద్యోగ సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలి

గుంటూరు మెడికల్ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో వైద్య మిత్ర, టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లు తమ ఉద్యోగ సర్వీసు సర్టిఫికెట్లను ఈనెల 8వ తేదీలోపు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమర్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై టీడీపీ శ్రేణుల దాడి



గాయపడిన శ్రీనివాసరెడ్డి

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): ముప్పాళ్ల మండలం లంకెల కూరపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు దాడికి దిగిన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొంత కాలంగా నరసరావుపేటలో నివాసముంటున్నాడు. మాజీ సర్పంచ్ వర్ధంతి కార్యక్రమానికి గ్రామానికి వచ్చాడు. పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి(పెదకాపు), అతని కుమారుడు బ్రహ్మారెడ్డి, కిష్టిపాటి లింగారెడ్డిలు విచక్షణారహితంగా దాడి చేశారు. ముఖంపైన తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేస్తుండగా స్పృహ కోల్పోవటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయపడిన శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఆసుపత్రిలో పరామర్శించారు.

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అవినీతిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు తూర్పు శాసన సభ్యుడు, వక్ఫ్ బోర్డు సభ్యుడు నసీర్ అహ్మద్ వక్ఫ్ స్థలాలను ఆక్రమించుకున్న వారి నుంచి ముడుపులు వసూలు చేస్తున్నారంటూ కేంద్ర పార్లమెంటరీ, మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజుకు గుంటూరు వినోభా నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జుబేర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. గుంటూరులోని షాహి జామియా మసీదు (పెద్ద మసీదు)కు సంబంధించిన రెడ్డిపాలెంలో ఉన్న వక్ఫ్ భూములు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులో తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కబ్జాదారుల నుంచి నగదు చెల్లించాలంటూ హుకుం జారీ చేస్తున్నారని వివరించారు. వక్ఫ్ అధికారులను బెదిరిస్తూ మసీదు కమిటీ వేయించి, అంజుమన్ ఇస్లామియా కమిటీలో అధ్యక్షుడిగా నసీర్ అహ్మద్ ఉన్నారని తెలిపారు. అంజుమన్ ఇస్లామియాలో వక్ఫ్‌బోర్డు వారి అనుమతులు లేకుండా షాపులను నిర్మించారని, ఆ షాపు నిర్మాణానికి ప్రజల వద్ద నుంచి భారీగా ముడుపులు అందుకున్నారని వక్ఫ్ లీజ్ నిబంధనల ప్రకారం ఆ షాపులను ఓపెన్ ఆక్షన్ వేయాలని వివరించారు. లాల్‌తలాబ్ మసీదు కమిటీ విషయంలో, ఇక్బల్ మసీదులో అవకతవకలు చేసి కమిటీలను ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విచారణ జరిపి రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు ప్రతులను కేంద్ర మైనారిటి శాఖ మంత్రి, కేంద్ర వక్ఫ్ బోర్డు కౌన్సిల్‌తోపాటు రాష్ట్ర గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి పంపారు.

పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ జి.పున్నారావు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని పెన్షనర్స్ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సవరణ జరిగితే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. పెన్షనర్లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ఇటువంటి అంశాలు తీసుకునేటప్పుడు ప్రభుత్వాలు ఆలోచించాలన్నారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వెంకటేశ్వర్లు, ఎం.ఎస్.మూర్తి, టి.శ్రీనివాసరావు, పార్థసారథి పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

నంబూరులో లారీ ఢీకొని మహిళ మృతి



మహిళను ఢీకొట్టిన లారీ



మరణించిన వెంకటరత్నం

పెదకాకాని: రోడ్డు పక్కన నిలబడి ఉన్న మహిళను లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన నంబూరులో జరిగింది. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన వుయ్యూరు వెంకటరత్నం బుధవారం రాత్రి గ్రామంలోని గోళ్లమూడి రోడ్డులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి బయలు దేరింది. శివాలయం సెంటర్‌కు వచ్చే సరికి గోళ్ళమూడి నుంచి ఈమని వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటరత్నం(52) పరిస్థితి విషమించి మరణించింది. మృతురాలికి కుమార్తె లావణ్య, కుమారుడు తారక్ ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండటంతో మృతదేహాన్ని పెదకాకానిలోని అపరకర్మల సత్రంలోని ఏసీ బాక్స్‌లో ఉంచారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య



మృతురాలు బైలడుగు రమణ

బొల్లాపల్లి: పురుగుమందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బొల్లాపల్లి మండలం కంద్రిక గ్రామానికి చెందిన బైలడుగు రమణ(45) మద్యానికి బానిసైన భర్తను బెదిరించేందుకు గత నెల 29వ తేదీన పురుగుల మందు తాగింది. వెంటనే బంధువులు వినుకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త చిన్న బాదరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ జె.భాస్కరరావు తెలిపారు.

వేధింపులకు గురైన బాలిక ఆస్పత్రికి తరలింపు

చిలకలూరిపేటటౌన్: బాలికపై కన్నతల్లే కర్కశంగా వేధించిన కేసులో బాలల హక్కుల పరిరక్షణ అధికారులు స్పందించారు. పట్టణంలోని ఈనెల 31వ తేదీన ఏడాది కిందట భర్తతో విడిపోయి ప్రియుడితో సహజీవనం చేస్తున్న దీప్తి తన కుమార్తెను వేధింపులకు గురిచేసిన విషయం విధితమే. బాధిత బాలికను పరామర్శించి ఐసీడీఎస్ సీడీపీఓ, మహిళ పోలీస్, డీసీపీఓ వివరాలను సేకరించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళ పోలీస్ ఆధ్వర్యంలో బాలికను గుంటూరు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అనంతరం నరసరావుపేట బాలల సదన్‌లో చేర్పించనున్నట్లు వారు వెల్లడించారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్


పిడుగురాళ్ల: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్ కుమార్ సూచించారు. పిడుగురాళ్ల పట్టణ, గ్రామీణ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో గురవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ... విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కరెంట్ బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ పరిధిలోని జానపాడు, రూరల్ పరిధిలోని జూలకల్లు సబ్ స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. వేసవిలో లోడ్ పెరుగుతున్న కారణంగా దానికి అనుగుణంగా విద్యుత్ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండి అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు. 50 శాతం అదనపు లోడ్ సబ్సిడీ స్కీమ్‌ను గృహ వినియోగదారులందరు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.నాగసురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జూలకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్

బాకీ ఎగ్గొట్టేందుకు తప్పుడు కేసు

నరసరావుపేటటౌన్: బాకీ డబ్బులు ఎగ్గొట్టేందుకు తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని ఏలూరి ప్రసాద్ విమర్శించారు. గురువారం ప్రకాష్‌నగర్ సిరి అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అమరా వెంకటేశ్వరరావు బాధితులతో కలిసి మాట్లాడారు. పట్టణానికి చెందిన అమరా వెంకటేశ్వరరావు అమరా ఇంజినీరింగ్ కాలేజీ నిర్వహిస్తూ ఆర్థిక సమస్యలతో 2023లో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అతనికి సన్నిహితంగా ఉండే వారి వద్ద సుమారు రూ.10 కోట్లు అప్పుగా తీసుకొని ఇంజినీరింగ్ కాలేజీ నిర్మించాడన్నారు. కాలేజీని కోర్టు వేలం వేసి బ్యాంకుకు చెల్లించవలసిన పైకం పోనూ మిగిలిన మొత్తాన్ని సొసైటీ పేరిట సుమారు రూ.4 కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేశారన్నారు. వెంకటేశ్వరరావు మృతి అనంతరం ఆయన భార్య అమరా సుధారాణి, వారి పిల్లలు బాకీదారులతో సన్నిహితంగా ఉంటూ ఉన్న ఆస్తిని అమ్మి బాకీలు తీరుస్తామని నమ్మబలుకుతూ వచ్చారన్నారు. ఇటీవల నరసరావుపేటలో ఐపీ పెట్టే వారి సంఖ్య పెరగటంతో వీళ్లు కూడా డబ్బులు ఎగ్గొట్టాలని దురాలోచన చేశారన్నారు. అందులో భాగంగానే బుధవారం సుధారాణి తమపై తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి నిజానిజాలు తెలుసుకొని తగిన న్యాయం చేయవలసిందిగా కోరారు. సమావేశంలో కండె హనుమంతరావు, కూరపాటి శ్రీనివాస గుప్తా, కొత్తూరు సురేషు, పెనుగొండ ప్రతాపు, పెనుగొండ ప్రభాకర్, సీతారామయ్య, చీరాల నారాయణ, ఇక్కుర్తి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమరా ఇంజినీరింగ్ కాలేజ్ బాధితులు ఏలూరి ప్రసాద్ తదితరులు